క్లుప్తంగా

వర్షాలకు ఇళ్లు ధ్వంసం

కుక్కునూరు: అల్పపీడన ప్రభావంతో కొన్ని రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని కొండపల్లిలో రెండు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన మారపాక పెద్ద పున్నయ్య, పేరాల లక్ష్మయ్యలకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. కాగా నిరుపేదలమైన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాయపూడి

కొయ్యలగూడెం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పురస్కారానికి రాయపూడి వెంకటరమణ ఎంపికైనట్లు ఎంఈవో జె.సురేష్ బాబు బుధవారం పేర్కొన్నారు. కుంతలగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయనను ప్రభుత్వం ఎంపిక చేసిందని, టీచర్స్ డే సందర్భంగా గురువారం ఏలూరులో నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేస్తారన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

లింగపాలెం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి సందర్భంగా బుధవారం వాసవీ క్లబ్, వనిత డైమండ్ క్లబ్ ధర్మాజీగూడెం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీఎస్ బోనగిరి, ఎన్‌బీఎస్ ప్రకాశరావు పాల్గొని మాట్లాడారు. వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ సోమిశెట్టి గంగాధరరావు, సమయమంతుల బలరామ కృష్ణ, మన్యం పుల్లేశ్వరరావు, వనిత క్లబ్ ప్రెసిడెంట్ కందుల రత్నమాల, కొలిపర్తి పుష్పకుమారి, సమయమంతుల రమాదేవి, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ కందుల వెంకట శాస్త్రి, గుడిమెట్ల శ్రీరాములు, తదితరులు

పిల్లల సంరక్షణ కేంద్రాల పరిశీలన

చింతలపూడి: చిన్నారుల సంరక్షణ ఎంతో బాధ్యతతో కూడుకుందని, జేజే యాక్ట్ పరిధిలో రిజిస్టర్ అయిన కేంద్రాల నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని డిస్టిక్ లెవెల్ ఇన్‌స్పెక్షన్ టీం డిస్టిక్ ప్రొబేషన్ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ కన్వీనర్ శ్రీ. జె.దుర్గాప్రసాద్ అన్నారు. చింతలపూడి లిబర్టీ చిల్డ్రన్ హోం, అల్లిపల్లి మేరీమాత చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌లను కమిటీ బుధవారం తనిఖీ చేసింది. బాలలకు అందిస్తున్న వసతి, సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించి అదేవిధంగా వసతి గృహాలు అందిస్తున్నటువంటి కార్యక్రమాల గురించి నిర్వాహకులు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్ డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.సూర్య చక్రవేణి, సభ్యులు. చింతలపూడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.మాధవి, ఇనిస్టిట్యూషనల్ కేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీకాంత్, లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ సి.జాహ్నవి గారు పాల్గొన్నారు.

కర పత్రాల విడుదల

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ ముంపు నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 5న కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 9న ఏలూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ, ఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్కే గౌస్ కోరారు. బుధవారం కుక్కునూరులో ధర్నా జయప్రదం కోరుతూ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్కే మున్ని, పి.దుర్గమ్మ, పి.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

వీడని వరద.. తొలగని ముంపు

- నెల తిరగక ముందే మళ్లీ గోదావరి వరద
- జల దిగ్బంధంలో 29 గిరిజన గ్రామాలు

వేలేరుపాడు: ఒక పక్క భారీ వర్షాలు, మరో పక్క గోదావరి వరదలతో వేలేరుపాడు మండల ప్రజలు వణికిపోతున్నారు. గత నెల రోజుల పాటు గిరిజన గ్రామాలను వణికించిన గోదావరి వరద రెండు రోజులుగా హడలెత్తిస్తూనే ఉంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం రాత్రి 7 గంటలకు 44.3 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి మళ్లీ పెరగడంతో వేలేరుపాడు మండలంలోని 29 గిరిజన గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు విలవిలలాడిపోతున్నారు. ఆగస్టులో నెల రోజులు జల దిగ్బంధంలో ఉన్న ఆయా గ్రామాల గిరిజనులు మరలా అదే గ్రామాలను గోదావరి చుట్టుముడుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి వరద వలన వేలేరుపాడు మండలంలోని మేళ్లవాగు, ఎద్దెలవాగు, టేకూరు వాగులు, నీట మునిగాయి. వేలేరుపాడు నుంచి రుద్రమకోట వెళ్లే రహదారిలో పెద్దవాగు వంతెన ప్రాంతంలో రహదారి నీట మునిగింది. 29 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. వేలేరుపాడు మండలానికి దిగువనున్న కొయిదా, కాచారం, టేకుపల్లి, కాకిస్నూరు, చినమంకోలు, పెద్దమంకోలు, పేరంటపల్లి, టేకూరు, పూసుగొంది, తాళ్లగొంది,



గోదావరి వరదతో నీట మునిగిన మేళ్లవాగు వంతెన



నీట మునిగిన వేలేరుపాడు నుంచి రుద్రమకోట వెళ్లే రహదారి

కట్కూరు, సిద్దారం, కుంకుడు కొయ్యలపాకలు, ఎడవవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురుమామిడి, బోళ్లపల్లి, పాతనార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు, మరో ఎనిమిది గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు మంగళవారం రాత్రి నుంచే తెగిపోయాయి. ఎద్దెలవాగు వద్ద అధికారులు ఒక దేశీయ బోట్ ఏర్పాటు చేశారు. వేలేరుపాడు నుంచి కన్నాయిగుట్ట వెళ్లే రహదారిలో మేళ్లవాగు వంతెన పూర్తిగా మునిగిపోయింది. దీంతో కన్నాయిగుట్ట గ్రామస్తులు భూదేవిపేట, చాగరపల్లి, బుర్రతోగు రహదారి గుండా కన్నాయిగుట్టకు వెళ్తున్నారు. భారీ వర్షాలకు పెద్దవాగు పొంగి ప్రవహిస్తుండడంతో వాగు వెంబడి కమ్మరిగూడెం, ఒంటిబండ, రామవరం ఊటగుంపు, తదితర గ్రామాలకు మండల కేంద్రంతో గత మూడు రోజులుగా సంబంధాలు తెగిపోయాయి. ఈ ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోవడంతో ఇటీవల మూడున్నర కోట్ల వ్యయంతో రింగ్ బండ నిర్మించారు. అది కూడా సోమవారం తెగిపోవడంతో పెద్దవాగు పొంగి ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే పెద్దవాగు ఆటంకంగా ఉంది. వాగు ప్రవాహానికి గ్రామాల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షాల వలన వస్తున్న వరదను నియంత్రించేందుకు ప్రాజెక్ట్‌కు గేట్లు కూడా లేకపోవడంతో నిత్యం వరద నీరు వాగులో ప్రవహిస్తుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు.

కొయ్యలగూడెం: ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు గ్రామాలలో పల్లపు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. నరసన్నపాలెం సమీపంలోని బైనేరు, పులి వాగు, కన్నాపురంలోని తూర్పు పడమటి కాలువలు, రాజవరం వద్ద ఎర్రకాలువ పొంగి ప్రవహించాయి. కన్నాపురం పోలవరం రోడ్డులో తూర్పు గోదావరి కల్వర్టుపై నుంచి పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మణి దివ్య ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది వరద ప్రాంతాలలో ప్రజలకు సహాయ చర్యలు చేపట్టారు.

అన్న ప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వరసిద్ది వినాయక స్వామి వారి ఆలయంలో బుధవారం అన్న ప్రసాద వితరణ చేశారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. సుమారు 1400 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ అన్నప్రసాద కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్‌రెడ్డి, చల్లా వరప్రసాద్, శ్రీధరాల శ్రీనివాస వెంకట గంగాధర్, చెన్నూరు శివాజీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు భృతి కల్పించాలి

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ పనులు లేనందున కూలీలకు నిరుద్యోగ భృతి రూ.5 వేలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జోడి సూర్యచంద్రం అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర రావు, ఎం.జీవరత్నం పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పని మండల పట్టణ గ్రామాలకు నూతన పనులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యాగంటి సీత, సీహెచ్ లక్ష్మీనారాయణ, పి.చంటి, వి.నరసింహారావు, నిట్ట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కుక్కునూరు: వీవోఏలకు ఈ ఏడాది మార్చి నుంచి రావాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించి, అక్రమ తొలగింపులు ఆపాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయి కిరణ్ అన్నారు. బుధవారం యానిమేటర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న యానిమేటర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ గడవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏలు అక్రమ తొలగింపులకు, వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వందలాది మందిని తొలగించారని ఆరోపించారు. వీవోఏల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ



ఏపీఎంకు వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

సమాఖ్య జనరల్ బాడీ సమావేశం నిర్వహించకుండా, తీర్మానం లేకుండా, కొత్త మినిట్స్ బుక్స్‌లో మండల అధికారులే తీర్మానం వ్రాస్తున్నారన్నారు. గ్రామ సంఘం లీడర్లను మండల సమాఖ్య కార్యాలయానికి పిలిపించి, విషయం చెప్పకుండా సంతకాలు చేయించి, పాతవారిని తొలగించి కొత్తవారిని నియమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేస్తామన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి

కొయ్యలగూడెం: అశోక్ నగర్‌లో అధ్వానంగా ఉన్న రహదారిని మరమ్మతులు చేయాలని స్థానికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కొయ్యలగూడెం పట్టణంలో అతిపెద్ద పొడవు కలిగిన అశోక్ నగర్ రోడ్డు (చేపలపేట రోడ్డు) గుంతలు ఏర్పడి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది రైతాంగానికి ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటామని రైతులు తెలిపారు. ఇదే రోడ్డు మీదుగా జగనన్న కాలనీకి వెళ్లాల్సి ఉందని, కేవలం రాజకీయ కుట్రల నేపథ్యంలో రహదారి మార్గం అభివృద్ధి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం కనబరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రెండు సార్లు సీసీ రోడ్డు



అధ్వానంగా ఉన్న రహదారి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

మంజూరు అయినా కూడా రాజకీయాల నేపథ్యంలో వేరొక ప్రాంతానికి నిధులు మళ్లించారని ఆరోపించారు. ఇప్పటికైనా పాలకులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చవితి నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

జంగారెడ్డిగూడెం: వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లు పోలీసులు సూచించిన నియమ నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెం వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే చవితి పందిళ్లు, ఉత్సవాల నిర్వహణపై జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలోని నిర్వాహకులకు బుధవారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినాయక విగ్రహాల ప్రతిష్ట, ఊరేగింపు, నిమజ్జన సమయాలలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రజా జీవనానికి ఆటంకం లేకుండా అనుమతించిన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై జబీర్, పోలీసు సిబ్బంది, వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉధ్ధృతంగా పెరుగుతున్న గోదావరి వరద



ఎల్‌ఎన్‌డీ పేట రిజర్వాయర్ రెండు గేట్ల నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం



రహదారి పైకి వచ్చిన వరద నీరు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లో, రోడ్లపైన ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం ప్రభావంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పేడ్రాల, నక్కల గొయ్యి, ఇసుక కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇసుక కాలువ నీరు కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరి నదిలోకి చేరుతోంది. రేపల్లెవాడ, గుంజవరం మధ్య కాజ్‌వేపై కొండవాగుల నీరు ప్రవహించడంతో కొంత సేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వింజరం గ్రామ సమీపంలోని కాజ్‌వేపై కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని తహసీల్దార్ బీఎస్ ఆర్ఎల్ రాజు, మండల ప్రత్యేక అధికారి దేవకీదేవి పరిశీలించారు.

ఎల్‌ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి నీరు విడుదల

కొండల్లో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నిండు కుండలా తలపిస్తోంది. రిజర్వాయర్‌లో నీటి మట్టం 89.85 మీటర్లకు చేరుకుంది. ఎఫ్ఆర్ఎల్ లెవల్ 90.50 మీటర్లు కాగా, రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 480 క్యూసెక్కుల నీరు రెండు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరంతా కొవ్వాడ కాలువ ద్వారా పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతోంది.

పెరుగుతున్న గోదావరి ఉధృతి

కుక్కునూరు: గోదావరి వరద క్రమేపి పెరుగుతుంది. భద్రాచలం వద్ద బుధవారం మధ్యాహ్నానికి వరద ప్రవాహం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బుధవారం సాయంత్రం గోదావరి వరద భద్రాచలం వద్ద 44 అడుగులకు చేరుకుంది. కాగా పెరిగిన వరద మండలంలోని వాగుల్లోకి చొచ్చుకు రావడంతో పలు గ్రామాల్లోని పొలాల్లో వరద నీరు చేరింది. గోదావరి వరద పాలవాగులోకి చొచ్చుకురావడంతో ఎర్రబోరు-ముత్యాలంపాడు గ్రామాల మధ్య రహదారి నీట మునిగింది. ఈ వరద ప్రవాహం మరో రెండు, మూడు అడుగులకు చేరితే మండలంలోని వేలేరు నుంచి శ్రీధర, సీతారామనగరం గ్రామాలకు వెళ్లే రహదారి నీట మునిగి రాకపోకలు నిలిచిపోతాయి.

నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం: నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతర పర్యవేక్షణతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ సూచించారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ ద్వారా వివిధ ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. సీసీ కెమెరాలు లేనటువంటి ప్రదేశాలలో పబ్లిక్ భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీస్ స్టేషన్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్‌లకు అనుసంధానం చేసేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఎస్సై జబీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రిసెప్షన్ సెంటర్, రికార్డులను పరిశీంచి



కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

ఎస్సై వి.చంద్రశేఖర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాత్రి బీటు నిర్వహించే కానిస్టేబుల్‌తో మాట్లాడుతూ రాత్రిపూట పహారాలు ఏ విధంగా చేయాలి అనే విషయాలపై, బీట్ బుక్ నిర్వహణపై తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

కొయ్యలగూడెం: అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయాలని, సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలో బోడిగూడెం, యర్రంపేట గ్రామ సచివాలయాల వద్ద, సచివాలయాల సిబ్బందికి సీపీఐ నాయకులతో కలిసి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమాలలో దుగ్గిరాల నారాయణరావు, చింతలపూడి దుర్గారావు, పెద్దకాపు, సత్యనారాయణ, ఎం.లక్ష్మణరావు, జక్కు నాగేశ్వరావు, జక్కు మంగరావు, సూరిబాబు, మెంటే దొరయ్య, తేలే వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు శ్రీవారి ప్రసాదాలు

ద్వారకాతిరుమల: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం బుధవారం శ్రీవారి పులిహోర, వాటర్ ప్యాకెట్లను పంపించారు. రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాల మేరకు 5,500 పులిహోర ప్యాకెట్లను, 6 వేల వాటర్ ప్యాకెట్లను విజయవాడకు పంపినట్లు ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. వీటిని తమ సిబ్బంది స్వయంగా వెళ్లి బాధితులకు అందచేసినట్లు ఆయన తెలిపారు.

ముగిసిన యాగాలు

టి.నరసాపురం: అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న యాగాలు బుధవారం ముగిశాయి. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు, ధృవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిఖరాభిషేకం, శాంతి కల్యాణం, మహారుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం చండీయాగం, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు

మాల్ ఉద్యోగి నిరసన

జంగారెడ్డిగూడెం: తనను వివక్ష చూపుతూ వేధింపులకు గురి చేస్తున్నారని పట్టణంలోని ఓ షాపింగ్ మాల్ వద్ద మాల్ ఉద్యోగి నిరసన చేపట్టాడు. మాల్‌లో పని చేసే ఎం.సందీప్ తనను కులం పేరుతో దూషిస్తూ వివక్ష చూపేవారని, వేధింపులకు గురి చేసే వారని బాధితుడు తెలిపాడు. దీనిపై గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్పీ కేసు నమోదు చేయాల్సిందిగా జంగారెడ్డిగూడెం పోలీసులను ఆదేశించారని, అయినా ఫలితం లేకపోయిందని బాధితుడు వాపోయాడు. బుధవారం యువకులతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు. దీనిపై షాపింగ్ మాల్ ప్రతినిధి రమేష్ స్పందిస్తూ తమ షాపింగ్ మాల్‌లో పని చేస్తూనే సందీప్ వేరే దుకాణంలో పని చేసేవాడన్నారు. దీనిపై యాజమాన్యం ప్రశ్నించే సరికి కేసు పెట్టేందుకు వెళ్లాడన్నారు. షాపింగ్ మాల్‌కు సంబంధించిన రూ.50 వేల వరకు తమకు సందీప్ నుంచి రావాల్సి ఉందని రమేష్ తెలిపారు.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి

- జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య

వేలేరుపాడు: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయినందున వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జంగారెడ్డిగూడెం ఆర్డవో కె.అద్దయ్య అన్నారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో గోదావరి వరదపై వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం వద్ద మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు జారీ అయితే మండలంలో 24 హ్యాబిటేషన్లలో ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఆయా హ్యాబిటేషన్లకు స్పెషల్ ఆఫీసర్‌లను నియమించినట్లు తెలిపారు. ఈవోఆర్డీ, ఏపీఎం, ఏపీవో తదితర క్యాడర్‌ల వారిని స్పెషల్ ఆఫీసర్‌లుగా నియమించామన్నారు. అధికారులు జల దిగ్బంధనంలోని గ్రామాల్లో నిత్యావసర వస్తువులు బాధితులకు అందుతున్నాయా, లేదా అనే విషయాలను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పనులు, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రాము, డీఎస్ఓ రాజు, డీఎల్‌పీవో రహమతుల్లా, తహసీల్దార్‌లు కె.చల్లన్న దొర, సత్యనారాయణ, ఎంపీడీవో మూర్తి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అద్దయ్య

వర్షాలకు పెంకుటిల్లు పాక్షిక ధ్వంసం

పోలవరం రూరల్: భారీ వర్షాల కారణంగా గూటాల పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మీదేవిపేటలో బంగాళా పెంకుటిల్లు పైకప్పు కొంతమేర కూలిపోయింది. మహాలక్ష్మీదేవిపేటకు చెందిన గంటా అరవాలమ్మ అనే వృద్ధురాలి బంగాళా పెంకుటిల్లు కూలడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి.

యువకుడి ఆత్మహత్యాయత్నం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం ఎర్రకాలువ బ్రిడ్జి వద్ద పురుగుల మందు సేవించి ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన ధర్మేంద్ర కార్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి ధర్మేంద్ర బయటకు వెళ్లి, రాత్రి కావస్తున్నా ధర్మేంద్ర ఇంటికి చేరుకోలేదు. ఎర్రకాలువ వంతెన వద్ద పురుగుమందు సేవించి ధర్మేంద్ర అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించి, ఆస్పత్రికి తరలించారు. కారు అద్దం పగిలిన విషయంపై యజమాని వేధించడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగుతున్నట్లు ధర్మేంద్ర సెల్ఫీ వీడియో చేశాడు. జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్ ధర్మేంద్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చింతలపూడి: పాత చింతలపూడిలో విషాదం చోటు చేసుకుంది. ముల్లగిరి రవి (40) మృతి చెందాడు. బుధవారం చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు ప్రాజెక్టు సమీపంలో రవి మృత దేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై కుటుంబరావు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేశారు.